క్లుప్తంగా

11న లక్ష్మీనరసింహస్వామి జయంతి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని కపిలగిరి యోగానంద లక్ష్మీనరసింహ స్వామి జయంతి ఉత్సవాలు ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్ష్య కార్యదర్శులు బొగ్గరపు శేషగిరిరావు, ఉపాధ్యక్షులు ఇమ్మడిశెట్టి చిన్నవీరారావు తెలిపారు. స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, సాయంత్రం 6 గంటలకు చందనోత్సవం, అనంతరం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామని వివరించారు. భక్తులు హాజరుకావాలని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

భూముల రీసర్వేకు రైతులు సహకరించాలి

తర్లుపాడు: రెండో విడత భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ కేకే కిశోర్ కుమార్ కోరారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో భూ రీసర్వేపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. సుదీర్ఘకాలంగా ఉన్న హద్దుల సమస్యలు సబ్‌డివిజన్, వారసత్వ భూముల పంపకాల్లో సమస్యలకు సర్వేలో పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. మండల సర్వేయర్ శ్రీవాణి, వీఆర్‌ఓ శివకాశి, గ్రామ సర్వేయర్లు కాశీమస్తాన్, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

రాచర్ల: రసాయన ఎరువుల వాడాకాన్ని రైతులు తగ్గించాలని ఏఓ షేక్.మహమ్మద్ రఫీక్ సూచించారు. మండలంలోని అనుమలవీడులో మట్టి నమూనా సేకరణ కార్యాక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి మట్టి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. తద్వారా అవసరమైన మేరకు ఎరువులు వాడుకుని పెట్టుబడి భారం తగ్గించుకోవచ్చన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. మండలంలో 724 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు రజిత, శ్రావణి పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

కొమరోలు/రాచర్ల: రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, పిల్లిపెసర, జీలుగలు అందిస్తున్నట్లు కొమరోలు ఏఓ రాజశ్రీ, రాచర్ల ఏఓ షేక్.మహమ్మద్ రఫీక్ తెలిపారు. కొమరోలు మండలానికి 20 క్వింటాళ్ల జీలుగ, 11 క్వింటాళ్ల జనుము, 5 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబరుతో రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని బుధవారం వేర్వేరు ప్రకటనల్లో సూచించారు.

ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్‌పార్కుకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. త్వరలో పెద్దఎత్తున పరిశ్రమలు రానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మితోపాటు పలువురు టీడీపి నాయకులు పాల్గొన్నారు. కాగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఏపీఐఐసీకి 110 ఎకరాల భూమిని కేటాయించారు. అప్పటి ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి కృషితో భూముల కేటాయింపు పూర్తి కాగా ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి.

నంది వాహనంపై చెన్నకేశవస్వామి


పూజల్లో పాల్గొన్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. బుధవారం స్వామి వారు నంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఉభయదాతలుగా దమ్మాల పాటి, బొడ్డపాటి, గోపిశెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకట కృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. గురువారం రథోత్సవం, శుక్రవారం వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రైతులకు యంత్ర పరికరాలు పంపిణీ

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన 99 మంది రైతులకు బుధవారం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. మార్కాపురంలోని ఏడీఏ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఏడీఏ బాలాజీ నాయక్, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


తర్లుపాడు పీహెచ్‌సీ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు



నీలకంఠేశ్వరస్వామి ఆలయం ఎదుట ఇదీ పరిస్థితి

పారిశుధ్యం అస్తవ్యస్తం

- తర్లుపాడు వీధుల్లో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు
- దుర్వాసన, దోమలతో జనం బెంబేలు
- పంచాయతీ అధికారుల తీరుపై ఆగ్రహం

తర్లుపాడు: పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వంతో మండల కేంద్రమైన తర్లుపాడులో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. రోజూ పారిశుధ్యాన్ని పర్యవేక్షిస్తూ, వ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన అధికారులు అలసత్వం వహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్షేత్ర స్థాయిలో పారిశుధ్య పనులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు పోయేందుకు అక్కడక్కడా కొన్ని కాలువలు ఉన్నా పూడుకుపోయి నిరుపయోగంగా మారడంతో పారిశుధ్యం దారుణంగా తయారైంది. కాలువలు బాగు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా తర్లుపాడులో బీసీ హాస్టల్ ఎదురు, నీలకంఠేశ్వర స్వామి దేవాలయం, ఎస్సీ హరిజన కాలనీ, పోలెబోయిన బజారు, రజక బజారు, నీలంపాటి అమ్మవారి బజారులో డ్రైనేజీ లేకపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఆయా వీధుల్లో పరిసరాలు దుర్వాసనభరింగా మారాయి. చీకటిపడే సమయానికి దోమలు విజృంభిస్తుండటంతో రోగాల బారిన పడుతున్నామని తర్లుపాడు వాసులు ఆందోళన చెందుతున్నారు.


హరిజన కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు


నీలంపాటి అమ్మవారి బజారులో..

డ్రైనేజీలు నిర్మించాలి

డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపైనే పారుతోంది. సమావేశాల్లో అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి.

– అక్బర్ అలీ, కోఆప్షన్ సభ్యులు, తర్లుపాడు




ఎస్సీ కాలనీలో పైపులైన్ కారణంగా ఏర్పడిన గుంత


బీసి హాస్టల్ ఎదురుగా మురుగు కూపం

బంగారు చీరలో వాసవీమాత

- ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు

మార్కాపురం: వాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మార్కాపురం పట్టణంలోని వాసవీ మాతను బంగారు చీరలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బుధవారం ఉదయం కోనేరు నుంచి అమ్మవారికి కలశాలు తీసుకొచ్చారు. భక్తులకు మిధునకుల గోత్రంవారు అన్న సంతర్పణ చేశారు. రాత్రి అమ్మవారి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష్య కార్యదర్శులు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, రామడుగు రమేష్, సూరె వెంకటసుబ్బారావు, చాటకొండ నాగరాజు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని ఘనంగా నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతోపాటు అన్న సంతర్పణ చేశారు.


కొమరోలులో పూజలందుకుంటున్న వాసవీమాత

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కుంకుమార్చన, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కొమరోలుకు చెందిన సుంకు అల్లూరయ్య దంపతులు వాసవీమాతకు ముత్యాల చీర బహూకరించారు.


బంగారు చీరలో దర్శనమిస్తున్న వాసవీమాత

వైభవంగా పట్టాభిరాముడి గ్రామోత్సవం

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో పట్టాభిరామ స్వామి ఆలయ వార్షికోత్సవం, శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. 8వ తేదీన ఉదయం వసంతోత్సవం, మధ్యాహ్నం మహానివేదన, రాత్రికి దొంగలదోపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వేదపండితులు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రికి అన్న సంతర్పణ ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది.


ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం

విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ

బేస్తవారిపేట: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, పుస్తక పఠనం, బొమ్మలు వేయడం, చెస్లో మెళకువలను వివరించారు. గ్రంథాలయాల్లో శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ కోరారు.


బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠ ఉత్సవాలు


గ్రామోత్సవంలో స్వామవారి విగ్రహాలు


గనివానిపాడులో నైవేద్యాలతో మహిళలు


హారతులతో ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పోలేరమ్మతల్లి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. బుధవారం స్వామివారి విగ్రహాల గ్రామోత్సవం కనులపండువగా సాగింది. కేరళ బృందం డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం పోలేరమ్మ, బ్రహ్మంగారి విగ్రహాల ప్రతిష్ఠతోపాటు రాత్రికి మహిళల కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వేడుకగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు బుధవారం కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గనివానిపాడు, మునగపాడు, కొనకనమిట్ల, చినమనగుండం, పెదారికట్ల గ్రామాల్లోని బ్రహ్మంగారి ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. గనివానిపాడులో సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లో భక్తులకు ఆలయ కమిటీలు, దాతల సహకారంతో అన్న సంతర్పణ చేశారు.

బ్రహ్మంగారి భక్తులకు అన్నదానం


టెంట్లు, నీటి వసతి ఏర్పాటు చేసిన ఆర్టీసి సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠం వెళ్లే భక్తుల సౌకర్యార్థం గిద్దలూరులోని అన్నా క్యాంటీన్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో కంచిపల్లె గ్రామానికి చెందిన దప్పిలి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో బుధవారం భక్తులకు భోజన వసతి కల్పించారు. బ్రహ్మం గారి ఆరాధనకు వెళ్లే భక్తులు ఎండలో ఇబ్బందులు పడుతున్న తీరుపై బుధవారం 'సాక్షి'లో 'కసరా.. కసరా.. పాలకుడా' శీర్షికన ప్రచురించిన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. భక్తులకు నీడ కోసం టెంట్లు వేసి, కుర్చీలు ఏర్పాటు చేశారు. భక్తులు ఇబ్బంది పడకుండా అదనపు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది భాస్కర్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

- పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి

పొదిలి రూరల్: పశుపోషకులకు ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి సూచించారు. బుధవారం పొదిలి మండలంలోని ఉన్నగురువాయుపాలెం పశువైద్యశాలలో పశు సమీకృత దాణాను పశుపోషకులకు పంపిణీ చేశారు. జేడీ మాట్లాడుతూ.. పశువులకు నాణ్యమైన సమీకృత దాణా 50 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి 50 కిలోల దాణాను సబ్సిడీపోను రూ.555 అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో రైతుకు మూడు నెలలకు గాను 450 కిలోలు దాణా అందిస్తామని స్పష్టం చేశారు. పశువులకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


పశుపోషకులకు దాణా పంపిణీ చేస్తున్న జేడీ బేబీరాణి

నైపుణ్యాలతో కూడిన ఉద్యోగ కల్పనే లక్ష్యం

మార్కాపురం టౌన్: విద్యా రంగంలో నైపుణ్యాల శిక్షణ, ఉపాధి కల్పన కీలకమని జిల్లా నైపుణ్యాల శిక్షణ సంస్థ మేనేజర్ జింకా రవితేజ పేర్కొన్నారు. బుధవారం మార్కాపురంలోని సాధనా డిగ్రీ కళాశాలలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సాంకేతిక సామగ్రి, పరికరాలు, నైపుణ్య శిక్షణ విధానాన్ని ఉపాధి కల్పన దిశగా కళాశాల అవలంబిస్తున్న విధానాలను పరిశీలించారు. గత పదేళ్లుగా ఉద్యోగాలు సాధించిన వారి జాబితాలు పరిశీలించి ప్రాంగణ నియామక విభాగం పనితీరును అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూధన్, క్యాంపస్ రిక్రూట్‌మెంట్, ట్రైనింగ్ విభాగం కోఆర్డినేటర్ కేవీఎస్ ఆర్ పవన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, పవన్‌కుమార్, పరిశోధనా విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శేషుకుమార్, అకడమిక్ ఇన్‌చార్జి ఆర్‌కేపీ ప్రసాద్‌తోపాటు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ ఫిరోజ్ పాల్గొన్నారు.


క్యాంపస్ ప్లేస్‌మెంట్ వివరాలు పరిశీలిస్తున్న రవితేజ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని బాపూజీ కాలనీ, భగత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడారు. నివాస ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. గంజాయి, అక్రమ మద్యం విక్రయించడం నేరమన్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

టెన్త్ మెరిట్ విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న కాపు నాయకులు

కంభం: కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కాపు సామాజికవర్గానికి చెందిన 9 మంది విద్యార్థులను బుధవారం శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఒక్కో విద్యార్థికి రూ.500 ప్రోత్సాహక బహుమతి, జ్ఞాపికలు అందజేశారు. ఇంటర్‌లోనూ మంచి మార్కులు సాధించాలని వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, పులిశ్రీనివాస ప్రసాద్, రఘువీర్, కాసుల పాండు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

మార్కాపురం: మండలంలోని బోడపాడు గ్రామానికి చెందిన నందిరెడ్డి ఓబుల్‌రెడ్డి కుటుంబ సభ్యులు తమ పొలం విషయంలో న్యాయం చేయాలని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పురుగుమందు డబ్బాలతో ఆందోళన చేశారు. తమ పొలాన్ని ఇతరులు ఆన్‌లైన్ చేయించుకున్నారని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ చిరంజీవి బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.